

ఉత్సవాలకు వేళాయే..

మెదక్ మున్సిపాలిటీ: బోనాలకు శ్రీమాత నల్లపోచమ్మ ఆలయం ముస్తాబైంది. ఆదివారం ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.



బిల్లులు తప్పనిసరి

విత్తనాలు కొనేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. వివరాలు 9లో ▸



తాగునీటి సమస్య ఉండొద్దు

గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అధికారులను ఆదేశించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



తలపడుతున్న మల్లయోధులు

పెద్దశంకరంపేట(మెదక్): దుర్గమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా చీలాపల్లిలో శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు జనాలు భారీగా తరలివచ్చారు.

ప్రశ్నిస్తే దాడులా?

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హత్యా రాజకీయాలు, బెదిరింపులు పెరిగిపోతున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. శనివారం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ నాగరాజుపై కాంగ్రెస్ కార్యకర్త గణేశ్ పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని వాపోయారు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు: డీపీఓ

పెద్దశంకరంపేట(మెదక్)/రేగోడ్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య తెలిపారు. శనివారం పెద్దశంకరంపేట పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం వైకుంఠధామం, పల్లె క్రీడా ప్రాంగణం, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా పంచాయతీల నిర్వాహణపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శులు బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటరాములు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండలకేంద్రమైన రేగోడ్‌ను సందర్శించారు.

రెండోరోజు 97 శాతం హాజరు

మెదక్ కలెక్టరేట్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సర విద్యార్థులు 1,271 మందికి గానూ 1,210 హాజరు కాగా హాజరుశాతం 95గా నమోదైంది. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 589 విద్యార్థుల హాజరుకావాల్సి ఉండగా 570 మంది హా జరయ్యారు. దీంతో విద్యార్థుల హాజరు శాతం 97గా నమోదైంది. జిల్లాలోని పరీక్ష కేంద్రాల ను డీఐఈఓ సత్యనారాయణతో పాటు కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించాయి.

దేవేందర్‌రెడ్డిపై వేటు!

మెదక్‌జోన్: రామాయంపేట మండలం కోనాపూర్ పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డిని శనివారం అధికారులు పదవి నుంచి తొలగించినట్లు సమాచారం. సొసైటీలో రూ.2.26 కోట్ల అవకతవకలు జరిగాయని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈక్రమంలో గతంలో దేవేందర్‌రెడ్డిని చైర్మన్ పదవి నుంచి తప్పించారు. దీంతో ఆయన కోర్టు అనుమతితో మళ్లీ చైర్మన్‌గా కొనసాగారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేవేందర్‌రెడ్డిని చైర్మన్ పదవి నుంచి తొలగించాలని డైరెక్టర్లు డిమాండ్ చేశారు. ఆయనను శనివారం చైర్మన్ పదవి నుంచి తొలగించినట్లు సమాచారం.

నాణ్యతతో కుట్టాలి: డీఆర్డీఓ



చేగుంట: యూనిఫాంను పరిశీలిస్తున్న డీఆర్డీఓ శ్రీనివాసరావు

మనోహరాబాద్(తూప్రాన్)/చేగుంట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం యూనిఫాం కుట్టే విధానాన్ని డీఆర్డీఓ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో, చేగుంట మండలం వడియారంలో మహిళా సంఘాల సభ్యులతో దుస్తులు కుట్టిస్తున్నారు. ఈసందర్భంగా శిబిరాలను సందర్శించి వారికి పలు సూచనలు ఇచ్చారు. పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు కుట్టు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

ధాన్యం..దైన్యం



సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం

అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి నానాకష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించినా సకాలంలో కొనుగోళ్లు సాగక పడిగాపులు కాయాల్సి వస్తోంది. అకాల వర్షం కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో రైతుల దుస్థితిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

8లో..

సిరిమువ్వల సవ్వడి

సండే స్పెషల్



ఆధునిక యుగంలో ప్రతీఒక్కరు పాశ్చాత్య వలలో చిక్కుకుని దేశ సంస్కృతీ సంప్రదాయాలకు దూరమవుతున్నారు. ప్రస్తుత కాలంలో నృత్యం అంటే చాలామందికి మాస్ స్టెప్పులే గుర్తుకు వస్తాయి. కానీ దేశంలో అతి ప్రాచీనమైన నృత్య రూపాలు ఎన్నో ఉన్నాయనే విషయం చాలామందికి తెలియదు. సాంప్రదాయ, శాస్త్రీయ, జానపద, గిరిజన నృత్య శైలులు ఎంతో మనోహరంగా ఉంటాయి. వాటిని చాలామంది పట్టించుకోకపోయినా కొందరు వీటిపై ఇప్పటికీ ఇష్టంచూపుతున్నారు. వారి పిల్లలకు సంప్రదాయ నృత్యాలు, సంగీతం నేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- పర్వ శ్రీనాథ్, రామచంద్రాపురం (పటాన్‌చెరు):



- శాస్త్రీయ నాట్యం, సంగీతంపై ఆసక్తి
- చిన్నారులకు శిక్షణ ఇప్పిస్తున్న తల్లిదండ్రులు
- వేసవి సెలవుల్లో శిబిరాలకు
- ప్రదర్శనలతో ప్రతిభ చాటుతున్న పిల్లలు

చిన్నారులకు పురాణ ఇతిహాసాలు, సంప్రదాయ విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు శాస్త్రీయ నృత్యాలు, సంగీతంలో శిక్షణ ఇప్పించే దిశగా తల్లిదండ్రులు అడుగులు వేస్తున్నారు. ఎక్కువగా వేసవి సెలవుల్లో పిల్లలను శిక్షణకు పంపించి వారిపై ఉన్న చదువుల ఒత్తిడిని కొంత తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కువ మంది చిన్నారులకు భరత నాట్యం నేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ నృత్యం భారత దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఎంతో ఖ్యాతి గాంచింది. ఆధునిక పోకడలతో కొందరు ఈ నృత్యాన్ని మరిచి పోతున్నా కొంతమంది ఇప్పటికి ఊపిరి పోస్తున్నారు. అందులో భాగంగా కొందరు చిన్నారులకు శాస్త్రీయ నృత్యాలు, సంగీతం నేర్పిస్తున్నారు.

పురాతన నృత్య రూపం..

పురాతన నృత్య రూపం భరత నాట్యం. ఇది వేల ఏళ్ల క్రితం భరత మునిచే లిఖించబడినట్లు పురాణాలు చెబుతున్నాయి. భరత నాట్యం ద్వారా వివిధ రకాల భావోద్వేగాలను వ్యక్తం చేయవచ్చు. తమిళనాడు, దక్షిణ భారతదేశంలోని దేవాలయాలలో ఉద్భవించిన ఈ పురాతన నృత్య రూపం ఎప్పటికీ, ఇప్పటికీ చాలా ప్రత్యేకం. ఈ నృత్యం ఆరాధన, భక్తి యొక్క మాధ్యమం, దేవతల పై భక్తిని వ్యక్తపరుస్తుంది. భరతనాట్యం నుంచే కూచిపూడి, కథక్, కథాకళి, మణిపూరి, ఒడిస్సీ, మోహిని ఆట్టం లాంటి భారతీయ శాస్త్రీయ నృత్యాలు వచ్చాయని గురువులు చెబుతున్నారు.

100పైగా కేంద్రాలు..

సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం, పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లలో శాస్త్రీయ నృత్యం, సంగీతం నేర్పే కేంద్రాలు వందకు పైగా ఉన్నాయి. శిక్షణ వచ్చే ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.500 నుంచి రూ.1500 ఫీజు తీసుకుంటారు. భరతనాట్యం నేర్చుకోవడానికి చిన్నారుల ఆసక్తి మీద ఆధారపడి ఉంటుంది. ఇందులో (1)జతీ స్వరం(2) అలరిప్పు(3) పుష్పాంజలి(4) గణపతి కౌత్వం(5)తిలాన(6) వర్ణం(7) మంగళంపై శిక్షణ ఇస్తారు. వీటిని నేర్చుకోవడానికి సుమారు ఐదేళ్ళు పడుతుందని గురువులు చెబుతున్నారు. భరతనాట్యం, కూచిపూడిలలో డిప్లొమా, పీజీ, పీహెచ్‌డీ చేయవచ్చని వివరిస్తున్నారు. ఇందులో రాణించే వారికి పరీక్షలు కూడా నిర్వహిస్తారని

వీటి పైనే ఆసక్తి..

తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా భరతనాట్యం, కూచిపూడిల పైనే ఆసక్తి చూపుతారు. ఐదేళ్ల వయస్సు కలిగిన చిన్నారులకు వీటిల్లో శిక్షణ ఇప్పిస్తారు. ఈ నృత్యాలలో పట్టు సాధించాలంటే కనీసం మూడేళ్ల పాటు శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నృత్యాలలో నేర్చుకోవాల్సింది ఎంతో ఉంటుందని గురువులు చెబుతున్నారు.



నృత్యం చేస్తున్న బాలిక

ఎన్నో ప్రయోజనాలు

భారతీయ శాస్త్రీయ నృత్యాలు నేర్చుకుని రాణించే వారికి బంగారు భవిష్యత్ ఉంటుంది. దేశ, విదేశాలలో జరిగే ప్రదర్శనలలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా చిన్నారుల్లో జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు ఏకాగ్రత, పట్టుదల పెరుగుతుంది. దాంతో వారు చదువుల్లో రాణిస్తారు. పిల్లల ఆరోగ్యానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాకుండా నాట్య ప్రత్యేక అలంకరణల ద్వారా సంప్రదాయంపై గౌరవం పెంపొందుతుంది.

25 ప్రదర్శనలు ఇచ్చా



నాలుగేళ్లగా నాట్య గురువు పద్మజ వద్ద శిక్షణ తీసుకుంటున్న. ఇప్పటి వరకు 25 ప్రదర్శనల్లో పాల్గొన్నాను. తిరుపతి, శ్రీశైలం ఆలయాలలో జరిగే కార్యక్రమాలలో నృత్య ప్రదర్శన చేశా. త్యాగరాయ గానసభ, రవీంద్రభారతితో పాటు అనేక ప్రాంతాలలో ప్రదర్శనలు ఇచ్చాను. చాలా సంతోషంగా ఉంది.

– వర్ధమాని హర్షిణి, ఎల్‌ఐజీ కాలనీ

వేలాది మంది విద్యార్థులకు శిక్షణ



శాస్త్రీయ నృత్యాలు నేర్చుకోవడం కోసం ఈ మధ్య చాలామంది ఆసక్తి చూపుతున్నారు. 30 ఏళ్లగా వేలాది మంది చిన్నారులకు భరత నాట్యంపై శిక్షణ ఇచ్చా. చిన్నారులకు శాస్త్రీయ నృత్యాలు, సంగీతం నేర్పించడం వలన దేశ సంస్కృతి, సంప్రదాయాలను పది తరాలకు అందించినట్లు అవుతుంది.

– బి.సంపత్ కుమార్, నాట్యాచార్యులు

విదేశీయులకు ఆన్‌లైన్‌లో..



కూచిపూడిలో డాక్టరేట్ పొందా. జాతీయ స్థాయిలో 30 ప్రదర్శలు ఇచ్చాను. స్థానికంగా మల్లికార్జున్‌నగర్‌లోని కేంద్రంలో 120 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న. అమెరికా, ఉగాండాలోని విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్న.

–ఐశ్వర్య రెడ్డి, కూచిపూడి నృత్యకారిణి

సమస్యలుంటే చెప్పండి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: పాఠశాలల పునః ప్రారంభంలోగా జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క పని కూడా పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచడమే లక్ష్యంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మైదానాలను ఉపాధి హామీ పథకం నిధులతో చదును చేయించాలన్నారు. రానున్న హరితహారంలో పండ్ల మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. బిల్లుల చెల్లింపులు జరిగిన ప్రతి పైసా లెక్క పక్కాగా ఉండాలని, చెల్లింపు వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఇంజనీరింగ్, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, నాసిరకం పురుగు మందులు అమ్ముతూ రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళారులు కొంతమంది నకిలీ విత్తనాలు సరఫరా చేసి రైతులను అప్పుల ఊబిలోకి నెట్టుతున్నారని ఆరోపించారు. నకిలీ విత్తనాలు రైతు కుటుంబాలను ఆర్థికంగా చిన్నాభిన్నం చేస్తున్నాయని వాపోయారు. జిల్లాలో పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు ఫర్టిలైజర్ షాపులపై ఆకస్మిక దాడులు చేయనున్నట్లు చెప్పారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అమ్మిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి: డీఈఓ

వెల్దుర్తి(తూప్రాన్): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. శనివారం మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల ప్రారంభం నాటికి ముఖ్యంగా మరుగుదొడ్లు, విద్యుత్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డీఈఓ వెంట మండల విద్యాధికారి యాదగిరి, సీఆర్పీ రాజు తదితరులు ఉన్నారు.

వేగవంతంగా కొనుగోళ్లు



నర్సాపూర్ రూరల్: కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్ రూరల్: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి చివరి గింజ కొనుగోలు చేసే వరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఈ యాసంగిలో 410 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ఇప్పటికే రూ.382.43 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. 163 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనడం పూర్తయిందన్నారు. కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. సిద్దిపేట జిల్లాకు తరలించేందుకు 10,000 వేల మెట్రిక్ టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాకు 40,000 మెట్రిక్ టన్నులు, ఇటీవల జోగులాంబ గద్వాల్ జిల్లాలకు 10,000 మెట్రిక్ టన్నులు తరలించేందుకు ఆర్డర్ వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, ఆర్‌ఐ సిద్ధిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం భద్రత పరిశీలన

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో భద్రపర్చిన ఈవీఎంల వద్ద భద్రత చర్యలను శనివారం కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటుచేశామన్నారు. సీసీ కెమెరాల పనితీరు, వాటి కంట్రోల్ రూంను పరిశీలించారు. భద్రత ఇతర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, ఆర్‌ఐ ఫైజల్ తదితరులు ఉన్నారు.

సకాలంలో యూనిఫాంలు అందించాలి

పాపన్నపేట(మెదక్): పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని యూసుఫ్‌పేట స్వయం సహాయక గ్రూపుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 78 వేల యూనిఫాంలు అవసరమవుతాయని చెప్పారు. ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఆర్‌ఐ శ్రీనివాస్ ఉన్నారు.

నకిలీపై ఉక్కుపాదం

- ప్రతీ మండలంలో ప్రత్యేక బృందాలు
- జీలుగ, పచ్చిరొట్ట కోసం ఆందోళన వద్దు
- రైతులకు అందుబాటులో వరి, పత్తి విత్తనాలు
- 'సాక్షి'తో డీఏఓ గోవింద్

హవేళిఘణాపూర్(మెదక్): నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రతీ మండలంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. శనివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. జీలుగ, పత్తి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు తొందరపడాల్సిన అవసరం లేదన్నారు.

నకిలీ విత్తనాల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఏఓ: పోలీసులు, వ్యవసాయ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో టీంను ఏర్పాటు చేశాం. వారు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

రైతులకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

డీఏఓ: నకిలీ విత్తనాలతో మోసపోకుండా ఈ బృందం రైతులకు అవగాహన కల్పిస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తనాలు వాడేలా వారికి వివరిస్తుంది.

జిల్లాలో ఎలాంటి పంటలు పండిస్తారు?

జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు పండిస్తారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో సాగు అంచనా ఎంత?


ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 3 లక్షల 73 వేల ఎకరాల పంటలు సాగు చేస్తారని అంచనా వేశాం. ఇందులో 3 లక్షల 27 వేల ఎకరాల్లో వరి, 40 వేల ఎకరాల్లో పత్తి, ఐదు వేల ఎకరాల్లో మొక్కజొన్న ఇతర పంటలు సాగు చేస్తారు.

జీలుగ, పచ్చిరొట్ట విత్తనాల కొరతకు కారణం?

గతంలో ఏప్రిల్‌లోనే జీలుగ, పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు టెండర్లు జరిగేవి. ఈసారి ఎన్నికల కోడ్‌తో అనుమతి వచ్చేందుకు కొంత ఆలస్యమైంది. విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుబడి చేసుకోవాల్సి ఉండడం, వర్షాలు ముందుగా పడడంతో రైతులు తొందరపడుతున్నారు.

జిల్లాకు ఎన్ని క్వింటాళ్ల జీలుగ అవసరం? ఎప్పటిలోగా అందుబాటులోకి తెస్తారు?

జిల్లాకు 6,400 క్వింటాళ్ల జీలుగ అవసరం కాగా 1,700 క్వింటాళ్లు, జనుము 1,250 క్వింటాళ్లు రైతులకు అందజేశాం. జూన్ 1 వరకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తాం.



పత్తి విత్తనాలు ఏ రకం మంచివి? విత్తన కొరత ఉందా?

జిల్లాలోని అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, టేక్మాల్ మండలాల్లో ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. రైతులు బీటీ– 2 బ్రాండెడ్ పత్తి విత్తనాలు ఎంచుకోవాలి. జిల్లాలో ఎలాంటి విత్తన కొరత లేదు.

ఈ సీజన్‌లో సన్నాలు ఎంత మేర సాగయ్యే అవకాశం ఉంది?

వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు ఎక్కువ శాతం సన్నాల వేసే అవకాశం ఉంది. సీజన్ లేకపోతే దొడ్డు రకం వైపు మొగ్గు చూపుతారు.

వరికొయ్యలు తగులబెట్టడం వల్ల వచ్చే ఇబ్బందులు ఏమిటి?

రైతులు తమ పంట పొలాల్లో ఉన్న వరి కొయ్యలు తగులబెట్టడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు భూమి సారం కోల్పోతుంది. అలాగే దిగుబడి తగ్గుతుంది. దుక్కులు దున్నిన తర్వాత నీరు పెట్టి సింగిల్ పాస్పేట్ వాడితే మంచి దిగుబడి వస్తుంది.

రైతులు ఎప్పటి వరకు విత్తనాలు వేసుకోవచ్చు?

సన్న రకాలు జూన్ 25 వరకు నాటు వేసుకోవాలి. దొడ్డు రకం జూన్ రెండోవారంలో నారుమడులు పోసుకొని జూలై 15 వరకు నాటు వేసుకోవాలి. తెలంగాణ సోనా జూలై 15 తర్వాత నారు పోసుకుంటే మంచిది. పెద్ద వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు చల్లితే బాగుంటుంది.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు

చేగుంట(తూప్రాన్‌): మండల కేంద్రమైన చేగుంట ప్రభుత్వ పాలిటెక్నిక్‌ నుంచి ఇటీవల ఈసెట్‌ ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిల ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్‌ చక్రవర్తి తెలిపారు. శనివారం రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థులను కళాశాలలో సన్మానించారు. కళాశాలలో చదివే ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌లో అలువాల గణేశ్‌ రాష్ట్ర స్థాయి మొదటిర్యాంకు సాధించగా, మహ్మద్‌ సమీ 14వ ర్యాంకు సాధించారని వీరిద్దరిని అభినందిస్తూ సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు ఎలక్ట్రానిక్‌ కోర్సు హెచ్‌ఓడీ శ్రీనికేతన్‌,కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకుడిపై హత్యాయత్నం

నిందితుడిని అరెస్ట్‌ చేసిన పోలీసులు

రామాయంపేట(మెదక్‌): బీఆర్‌ఎస్‌ పట్టణశాఖ అధ్యక్షుడు, స్థానిక మున్సిపల్‌ కౌన్సిలర్‌ గజవాడ నాగరాజుపై పెట్రోల్‌ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డ పోచమ్మల గణేశ్‌ అనే వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్‌ చేశారు. స్థానిక సీఐ వెంకటేశ్‌ కథనం మేరకు.. నాగరాజుకు, గణేశ్‌కు మధ్య భూ సంబంధిత వివాదం నెలకొంది. గణేశ్‌ తమ అమ్మ పేరిట ఉన్న ఎకరం భూమిని డెవలప్‌మెంట్‌ కోసం నాగరాజుతో అగ్రిమెంట్‌ చేసుకున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా ఆర్థిక విభేదాలు రావడంతో శనివారం పెద్దమ్మగుడి వద్ద మాట్లాడుకోవడానికి పిలిచి పెద్ద మనుషుల సమక్ష్యంలో కూర్చున్నారు. అకస్మాత్తుగా గణేశ్‌ నాగరాజుపై పెట్రోల్‌ పోసి నిప్పంటించడానికి ప్రయత్నించగా అక్కడ ఉన్నవారు అడ్డుకున్నారు. బాధిత నాగరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కేసు నమోదు చేసుకొని నిందితుడు గణేశ్‌ను అరెస్ట్‌ చేశారు. బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, స్థానిక మున్సిపల్‌ చైర్మన్‌ జితేందర్‌గౌడ్‌, సహకార సంఘం చైర్మన్‌ బాదె చంద్రం, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ సరాపు యాదగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మనోహరాబాద్‌(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. మనోహరాబాద్‌ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మూల నరేందర్‌(50) శనివారం బైక్‌పై పని నిమిత్తం మనోహరాబాద్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మెదక్‌ జోన్‌ : జాతీయ రహదారిపై ధాన్యం రాశులు



దుబ్బాక : తొగుట మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం

గ్రాండ్‌ రిపోర్ట్‌

కళ్లాల్లో ధాన్యం కళ్లల్లో దైన్యం

పేరుకుపోతున్న వడ్ల కుప్పలు

కొనుగోలు కోసం ఎదురుచూపులు ● తేమ, తరుగు పేరుతో జాప్యం

వేధిస్తున్న లారీల కొరత ● రాత్రింబవళ్లు ధాన్యం కుప్పల వద్దే రైతుల పడిగాపులు

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం విక్రయించడానికి అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. నారు పోసి.. పంట పండించి.. గింజ అమ్ముకునే వరకు వారు పడే తిప్పలు వర్ణనాతీతం. అకాల వర్షాలు, కేంద్రాల వద్ద అధికారులు, మిల్లుల వద్ద యజమానులు పెడుతున్న కొర్రీలకు తోడు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూకం కూడా రైతులకు భారంగా మారింది. ఉమ్మడి మెదక్‌ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా.. ధాన్యం కుప్పలు మాత్రం కదలడం లేదు. దీంతో ఎక్కడికక్కడే ధాన్యం రాశులు పేరుకుపోయాయి. లారీల కొరత, తూకం, తరుగు పేరుతో మిల్లర్లు ధాన్యం కొనేందుకు ఆలస్యం చేస్తుండడంతో రైతులు రేయింబవళ్లు ధాన్యం కుప్పల వద్దే కాపలా కాస్తున్నారు. రాశుల కుప్పలను చూసి కన్నీటి సుడులు తిరుగుతున్నాయి. అకాల వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన ప్రతిక్షణం కంటికి కునుకులేకుండా చేస్తోంది.

లారీలు రాక అవస్థలు



లారీ రాపోవడంతో కేంద్రం వద్ద తూకం వేసిన ధాన్యం బస్తాలు

నారాయణఖేడ్‌: లారీలు సక్రమంగా రాకపోవడంతో వరి ధాన్యం రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నారాయణఖేడ్‌ నియోజకవర్గంలోని కల్హేర్‌, సిర్గాపూర్‌, కంగ్టి, నిజాంపేట్‌, నారాయణఖేడ్‌ మండలాల్లో వరి కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్‌, డీసీఎంఎస్‌, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఖేడ్‌ పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో చాంద్‌ఖాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద లారీ రాకపోవడంతో తూకం వేసిన వడ్లు అలాగే ఉన్నాయి. 250 బస్తాల వరకు ఉండగా లారీ ట్రాన్స్‌పోర్టు యజమాని స్పందించక పోవడంతో ఆర్డీఓ దృష్టికి సమస్య తీసుకెళ్లినట్లు పీఏసీఎస్‌ కార్యదర్శి జగన్నాథం తెలిపారు. డీసీఎం వాహనం ఏర్పాటు చేసి ఆదివారం సరుకులు పంపించేలా చూస్తానని ఆర్డీఓ భరోసా ఇచ్చారని తెలిపారు. కేంద్రంలో ఇప్పటివరకు 71 మంది రైతుల వద్ద 9,452 బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు.

రహదారులపైనే ధాన్యం..



నిజాంపేట మండల కేంద్రంలో గత కొన్నిరోజులుగా మగ్గుతున్న ధాన్యం బస్తాలు

మెదక్‌జోన్‌: ఈ మహిళా రైతు పేరు గౌస్యబేగం కొల్చారం మండలం కిష్టాపూర్‌ గ్రామం. ఆమెకున్న 3 ఎకరాల్లో వరికోత కోసి ధాన్యాన్ని ఆరబెట్టి నెలరోజులు అవుతుంది. లారీలు లేవంటూ తూకం వేయడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇది ఒక్క గౌస్యబేగం పరిస్థితే కాదు జిల్లాలోని చాలా మంది రైతుల పరిస్థితి.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలోని చాలా కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం కూడా కేంద్రాల్లోనే మగ్గుతుంది. దీనంతటికీ కారణం లారీల కొరత అంటూ నిర్వాహకులు చెబుతున్నారు. మెదక్‌ జిల్లాలో 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలను గత నెల 10న ప్రారంభించారు. ఇప్పటి వరకు 2.35 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరించారు. సుమారు 150 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అయిపోగా క్లోజ్‌ చేశారు. ఇంకా సుమారు 35 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా నుంచి సిద్దిపేట, మహబూబ్‌నగర్‌, గద్వాల జిల్లాలకు సైతం ధాన్యం తరలిస్తున్నారు.

చివరికి చేరిన కొనుగోళ్లు



హుస్నాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం

హుస్నాబాద్‌: సిద్దిపేట జిల్లాలోనే మొట్టమొదలు హుస్నాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. హుస్నాబాద్‌ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ యార్డ్‌లో మూడు, నాలుగు కుప్పలు మాత్రమే అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. హుస్నాబాద్‌, అక్కన్నపేట మండలాల్లో ఐకేపీ కేంద్రాలు 13 సెంటర్లు, కట్కూర్‌లో పీఏసీఎస్‌ రెండు సెంటర్లు, హుస్నాబాద్‌, అక్కన్నపేట మండలాల్లో పీఏసీఎస్‌ సెంటర్లు 27 ఉన్నాయి. వీటిలో ఐకేపీ సెంటర్లు మొత్తం క్లోజ్‌ చేయగా, హుస్నాబాద్‌, మల్లంపల్లి పీఏసీఎస్‌ కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. హుస్నాబాద్‌, అక్కన్నపేట మండలాల్లో 1,41.091 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. అలాగే కోహెడ మండలంలో ఐకేపీ 15 సెంటర్లు ఉండగా, వీటి ద్వారా 1,34,500 క్వింటాళ్ల ధాన్యం, పీఏసీఎస్‌ సెంటర్లు 11 ఉండగా, వీటి ద్వారా 43 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. మరో రెండు రోజుల్లో కోహెడ మండలంలోని ధాన్యం కేంద్రాలను పూర్తి చేయనున్నారు.

రాత్రింబవళ్లు కాపలా..



అందోలు వద్ద ధాన్యం కుప్ప వద్ద మల్లేశం రైతు

జోగిపేట(అందోల్‌): అందోలు శివారులోని కొనుగోలు కేంద్రంలో లారీలు సకాలంలో రాకపోవడంతో తూకం వేసిన ధాన్యం రైస్‌మిల్‌లకు తరలించకుండా కేంద్రాల వద్దనే ఉండిపోయాయి. ఇటీవల కలెక్టర్‌ వల్లూరి క్రాంతి ఆకస్మికంగా కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసింది. ప్రతి రోజూ 4 నుంచి 5 లారీలు కేంద్రాలకు రావాలని ఆదేశించింది. అయినా కేవలం 2కు మించి రావడంలేదని రైతులు అంటున్నారు. శనివారం ఒక్కలారీ కూడా రాకపోవడంతో రైతులు వరి ధాన్యం కుప్పల వద్దనే కునుకు తీస్తున్నారు.

15 రోజులైనా కొనలేదు

తాను కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 15 రోజులైంది. ఇప్పటి వరకు కొనలేదు. రెండు సార్లు పెద్ద వర్షం కురిసింది. వానలో తడిసి, ఎండలో ఎండుతున్నాయి. కలెక్టర్‌ కేంద్రానికి వచ్చి చెప్పినా లారీలను మాత్రం పంపడంలేదు. మహిళలు కూడా ఉదయం నుంచి పొద్దుపోయే వరకు వరి కుప్పల వద్దనే ఉంటున్నారు.

మల్లేశం, రైతు, అందోలు



అందోలు కొనుగోలు కేంద్రం వద్ద వరి ధాన్యం కుప్పలు

కల్లాల్లోనే బస్తాలు



మొలకెత్తిన వడ్లను ఆరపెడుతున్న గౌతాపూర్‌కు చెందిన రైతు పెంట్యానాయక్‌



కాడిపల్లిలో వడ్ల బస్తాలపై చిరిగిన టార్పాలిన్లు కప్పిన రైతులు

నర్సాపూర్‌: నర్సాపూర్‌ మండలంలోని కాగజ్‌మద్దూర్‌లో సుమారు 400 బస్తాల ధాన్యం తూకం వేసి రవాణాకు సిద్ధంగా ఉన్నా లారీలు రానందున బస్తాలు కల్లాలోనే ఉన్నాయి. శివ్వంపేట మండలంలో సుమారు 40 వేల బస్తాల ధాన్యం రవాణాకు సిద్ధంగా ఉందని అంచనా. మూడు రోజుల నుంచి కొన్ని వాహనాలు రావడంతో రవాణా చేస్తున్నా ఇంకా రవాణాకు ధాన్యం నిలువలున్నాయి. కొల్చారం మండలంలోని కోనాపూర్‌ కేంద్రంలో సుమారు 50 లారీల ధాన్యం తూకం వేసి రవాణా చేసేందుకు సిద్ధంగా నిర్వాహకులు తూకం వేయడం లేదు. కౌడిపల్లి మండలంలోని పలు కేంద్రాల్లో తూకం వేసిన వడ్లను 20 రోజులుగా బస్తాల రవాణా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. చిలిపిచెడ్‌ మండలంలో చిట్కుల్‌ కేంద్రంలో ధాన్యం చాలా నిల్వ ఉండగా తూకం రవాణా పనులు సరిగా చేపట్టనందున రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

తేమ పరీక్షల పేరుతో జాప్యం



వడ్లు ఆరబోసి తూకం కోసం ఎదురుచూస్తున్న రైతు రాజయ్య

సిద్దిపేటజోన్‌: సిద్దిపేట మున్సిపల్‌ పరిధిలోని అంజయ్య అనే రైతు ధాన్యం 4 ట్రాక్టర్‌లలో సిద్దిపేట పత్తి మార్కెట్‌ యార్డుకు తీసుకొచ్చాడు. ధాన్యం తెచ్చి 4 రోజులు అయ్యింది. అధికారులు తూకం వేయాల్సి ఉంది. అంతకంటే ముందు వచ్చిన ధాన్యం తూకం, తేమ శాతం పరీక్షల ప్రక్రియను కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చేపట్టడంతో రోజుల కొద్ది యార్డులో ధాన్యంతో ఉండాల్సి వస్తుందని రైతు అంజయ్య వాపోయాడు.

కేంద్రాల్లో రైతుల స్థితి..

సిద్దిపేట పత్తి మార్కెట్‌ యార్డులో రైతులు ఐదు రోజులుగా ధాన్యం తెచ్చి తేమ శాతంకు అనుగుణంగా యార్డులో అర పెట్టారు. స్థానికంగా తరుగు సమస్యలు లేనప్పటికీ కొనుగోలు అనంతరం మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత ధాన్యం పరిస్థితి బట్టి మిల్లు నిర్వాహకులు కోత విధిస్తున్నారు. సిద్దిపేట యార్డులో భారీ షెడ్ల కింద ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ స్థలం లేక, గోదాంల కొరత వల్ల సిద్దిపేట యార్డులో షెడ్ల కింద ధాన్యం బస్తాల వందల సంఖ్యలో ఉన్నాయి. చిన్నకోడూర్‌, సిద్దిపేట ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలలో తేమ పరీక్షల ప్రక్రియ జాప్యంతో సాగుతోంది.

తరుగు పేరిట కోత



జగదేవ్‌పూర్‌ మండలం రాయవరం గ్రామంలో రోడ్డుపైనే ధాన్యం కుప్పలు

గజ్వేల్‌: గజ్వేల్‌ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల పరిశీలన చేయగా రైతుల ఇబ్బందులు కళ్లకు కట్టాయి. జగదేవ్‌పూర్‌ మండలం రాయవరం గ్రామంలో కొనుగోళ్ల ప్రక్రియ రోడ్డుపైనే సాగుతుంది. ధాన్యం తరలింపు ఆలస్యమవుతుండటంతో రోడ్లపైనే బస్తాలు నింపి పెట్టడం కనిపించింది. లారీల రాకపోవడంతో ట్రాక్టర్లను వాడుతున్నారు. జల్లి పట్టకుండానే కొనుగోళ్లు చేపడుతూ బస్తాపై కిలో నుంచి కిలోన్నర వరకు తరుగు పేరిట కోత పెడుతున్నారని రైతులు చెబుతున్నారు. గజ్వేల్‌ మండలం శేర్‌పల్లి గ్రామంలో బీహార్‌ కూలీలతో రోడ్లపైనే రైతుల ధాన్యం తూకం వేసి లారీలు నింపడం కనిపించింది. మర్కూక్‌ మండలం ఎర్రవల్లి, మర్కూక్‌, వర్దరాజపూర్‌ గ్రామల్లోనూ హమాలీల సమస్య వల్ల కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి.

మిరుదొడ్డి, తొగుట మండలాల్లో..



తొగుట మార్కెట్‌లో లారీలో లోడ్‌ చేస్తున్న ధాన్యం బస్తాలు

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన కొనసాగుతుంది. దుబ్బాక మార్కెట్‌ యార్డులో కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకోగా ఇక మిరుదొడ్డి, తొగుట మండలాల్లో ఇంకా 30 శాతంకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే కనిపిస్తుంది. తేమ శాతం పేరుతో కొనుగోలు ప్రక్రియ ఇబ్బందిగా తయారైంది. తేమ శాతం 16 కంటే తక్కువ రావాలని కొరివీలు పెడుతుండడంతో వారం, పది రోజులపాటు కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా మిరుదొడ్డి, తొగుట మండలాల్లో హామీల కొరతకు తోడు లారీల సమస్య కూడా ఇబ్బందిగా తయారైంది. లారీలు సక్రమంగా రాకపోతుండడంతో తుకాం పెట్టిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటున్నాయి.

గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేస్తాం

పౌర సరఫరాల జిల్లా అధికారి బ్రహ్మారావు

కొల్చారం(నర్సాపూర్‌): కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఈ నెల చివరి వరకు ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామని జిల్లా పౌర సరఫరాల జిల్లా అధికారి బ్రహ్మారావు తెలిపారు. శనివారం మండలంలోని రంగంపేట పీఏసీఎస్‌ను సందర్శించారు. పీఏసీఎస్‌ పరిధిలో ఇప్పటివరకు 70 వేల ధాన్యం బస్తాలను కొనుగోలు చేసి, రైస్‌ మిల్లులకు రవాణా చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రమేశ్‌ కుమార్‌, డైరెక్టర్‌ గంగయ్య, సంఘం సీఈఓ నవీన్‌, సిబ్బంది బీరప్ప, సిద్ధూ, దుర్గేశ్‌, రైతులు పాల్గొన్నారు.

మరో 35 వేల క్వింటాళ్ల సేకరణతో..

తూప్రాన్‌: తూప్రాన్‌ డివిజన్‌ పరిధిలోని మండలాల్లో ఇప్పటి వరకు 3.82 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామని ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం తూప్రాన్‌, వెల్దుర్తి, మనోహరాబాద్‌ మండలాల్లో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. మరో వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి అవుతుందని స్పష్టం చేశారు. కేవలం 35 వేల క్వింటాళ్ల ధాన్యం మాత్రం మిగిలి ఉందన్నారు. వెల్దుర్తి మండలంలోనే ఉన్నాయని, మిగితా మండలాల్లో పూర్తి అయిందన్నారు. డివిజన్‌ లో 84 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే, 53 కేంద్రాల్లో కొనుగోలు పూర్తి అయి మూసి వేశారని, కేవలం 31 కేంద్రాల్లోనే కొనుగోలు జరుగుతుందని వివరించారు. తూప్రాన్‌ డివిజన్‌లో కొనుగోలు వేగవంతంగా జరగటానికి సహకరిస్తున్న హమాలీలు, రైతులు, ఐకేపీ, సొసైటీ ఉద్యోగులు, రైస్‌ మిల్లర్లు, రెవెన్యూ ఉద్యోగులను అభినందిస్తున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

మనోహరాబాద్‌(తూప్రాన్‌): మద్యాన్నికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. హవేళి ఘనపూర్‌ మండలం ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన దోమకొండ సిద్దిరాములు కుటుంబంతో కలిసి బతుకు దెరువు కోసం మనోహరాబాద్‌ మండలంలోని కాళ్లకల్‌ గ్రామంలో ఉంటూ ఓ పరిశ్రమలో పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. చిన్న కుమారుడు సాయికుమార్‌గౌడ్‌ (23) కూలి పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజుల కిందట తాగుడుకు డబ్బులు కావాలని అడుగగా తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. శనివారం కాళ్లకల్‌ గ్రామ శివారులో మాదన్న కుంటలో ఓ వ్యక్తి మృతదేహం తేలిందని సమాచారం రావడంతో వెళ్లి బయటకు తీయించగా సాయికుమార్‌గా గుర్తించారు.

సేవా ధోరణితో పని చేయాలి

● అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు
● ఈ జిల్లా మేనేజర్‌ సందీప్‌

మెదక్‌ కలెక్టరేట్‌: సేవా ధోరణితో మీ సేవా కేంద్రాలు పనిచేయాలని, అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని మీ సేవ కేంద్రాల ఈ–జిల్లా మేనేజర్‌ సందీప్‌ పేర్కొన్నారు. శనివారం సమీకృత కలెక్టర్‌ కార్యాలయంలో ఆధార్‌ సెంటర్ల సమస్యలు, వన్‌ స్టాఫ్‌ సర్వీసెస్‌, స్త్రీ నిధి సంబంధిత విషయాలపై నిర్వాహకులతో ఈ జిల్లా మేనేజర్‌ సందీప్‌ సమీక్షించారు. ఈ సందర్భంగా సందీప్‌ మాట్లాడుతూ.. సేవా దృక్పథంతో మీసేవా కేంద్రాలు పని చేయాలని సూచించారు. ప్రభుత్వం పొందుపరిచిన ధరలను సమాచార బోర్డు ఏర్పాటు చేసి ఆ ధరలకే ప్రజలకు సేవలను అందించాలని తెలిపారు. ఆధార్‌ సమస్యలు లేకుండా చూడాలని, ప్రతీ ఒక్కరికి యూజర్‌ ఐడీ పాస్వర్డ్‌ ఇచ్చామన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను ప్రతీ ఒక్కరూ మీసేవ సెంటర్‌లో అమలు పరిచి సేవా దృక్పథంతో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎం టీఎస్‌టీఎస్‌ శశికాంత్‌, డీఎం సీఎస్‌సీ, స్త్రీనిధి మేనేజర్‌ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులో భారీ అగ్ని ప్రమాదం



మంటార్పుతున్న ఫైరింజన్‌ సిబ్బంది

గజ్వేల్‌ పట్టణంలో సేకరించిన చెత్త దగ్ధం

గజ్వేల్‌: గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్‌యార్డులో శనివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ యార్డులో ఇప్పటికే 20 వేల మెట్రిక్‌ టన్నుల తడి, పొడి, ప్లాస్టిక్‌, ఇతర చెత్తను వేర్వేరుగా బయోమైనింగ్‌ చేసి పెట్టారు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా అందులో మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాదం సమాచారం తెలుసుకున్న స్థానిక మున్సిపల్‌ కమిషనర్‌ గోల్కొండ నర్సయ్య ఘటనా స్థలానికి చేరుకొని ఫైరింజన్‌తోపాటు మున్సిపల్‌ వాటర్‌ ట్యాంకర్ల ద్వారా మంటలను ఆర్పించే చర్యలను చేపట్టారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం నర్సయ్య మాట్లాడుతూ.. సాయంత్రం సమయంలో పక్క పొలాల్లో నుంచి రైతులు పెట్టిన మంటలు ఎగిసిపడి యార్డులోకి రావడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడం వల్ల కూడా ఇబ్బందులు వస్తున్నాయన్నారు.

స్క్రాబ్‌ గోదాంలో మంటలు..

జిన్నారం(పటాన్‌చెరు): రసాయన డ్రమ్ములు నిల్వ ఉన్న ఓ స్క్రాబ్‌ గోదాంలో శుక్రవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలోని ఓ స్క్రాబ్‌ గోదాంలో రసాయన డ్రమ్ములు నిల్వ ఉన్నాయి. ఎండ తీవ్రతతో వాటి మధ్య చర్య జరిగి మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. ఫైర్‌ ఇంజన్‌ల ద్వారా మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. ఈ ఘటనలో ఎవరికి ప్రాణహానీ జరగలేదని ఎస్‌ఐ తెలిపారు.